www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 2 ఏప్రిల్ 2023
5
చిత్తూరు

నేడు ఉమ్మడి జిల్లా జిమ్నాస్టిక్స్ పోటీలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వై.ప్రవీణ్, శివప్రసాద్ తెలిపారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు (ఉమ్మడి చిత్తూరు జిల్లా) చెందిన జిమ్నాస్టిక్ క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు తిరుపతి యూత్ హాస్టల్ వేదికగా జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఆర్టిస్టిక్, రిథమిక్, ఏరోబిక్ పోటీలు నిర్వహిస్తామని, ఇందులో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామన్నారు. ఇందులో విజేతలు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు అర్హులైన, జిమ్నాస్టిక్ క్రీడాకారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9505873777 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ : కలెక్టర్



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

జిల్లాలో ఈ నెల 3 నుండి 18 వ తేదీ వరకు జరగబోయే 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ తెలిపారు. శనివారం 10వ తరగతి పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై జెసి ఎస్.వెంకటేశ్వర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ లతో కలిసి, డిఈఓ, ఆర్డీఓ లు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10 వ తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 115 పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగడానికి వీలు లేకుండా వీటి పర్యవేక్షణకు 6 ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ విద్యార్థి కూడా నేల పైన కూర్చొని పరీక్షలు రాసే పరిస్థితి రాకుండా అవసరమైన బెంచ్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. వీటితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, తాగునీటి ఏర్పాటు కల్పించాలని తెలిపారు. ఆర్డిఒ లు డిఎస్పి లతో సమన్వయం చేసుకుని జిల్లాలో పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలును, పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. పరీక్షా హాలులోకి చీఫ్ సూపరింటెండెంట్ తో సహా ఏ సిబ్బంది సెల్ ఫోన్ లు తీసుకువెళ్లడానికి వీలు లేదని తెలిపారు. డిఈఓ మాట్లాడుతూ ప్రశ్నా పత్రాలు జిల్లాకు వచ్చాయని, వీటిని 33 స్టోరేజ్ పాయింట్ లు పోలీస్ స్టేషన్‌లలో భద్రపరచడం జరిగిందన్నారు. 3వ తేదీ ఉదయం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రశ్నా పత్రాలను రూట్ ఆఫీసర్లు పరీక్షా కేంద్రాలలోని చీఫ్ సూపరింటెండెంట్ లకు అందజేయడం జరుగుతుందని, విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి ఉ.8.45 గంటల నుండి అనుమతించడం జరుగుతుందన్నారు. పరీక్షా హాలులోకి విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకు వెళ్లకుండా వారిని నిశితంగా చెక్ చేసి పంపేలా పోలీస్ వారికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పరీక్షా సమయంలో ఉ. 9 నుండి మ.1 గం. వరకు పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందన్నారు. ఆ ప్రాంతాలలో సంబంధిత తహశీల్దార్ల ద్వారా 144 సెక్షన్ ను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి పరీక్షలు ఉ. 9.30 గం. ల నుండి మ.12.45 గం. ల వరకు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉ.8.45 గం.ల లోపు చేరుకునేలా పాఠశాలల వారికి సూచనలు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వాహకు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితిలో వినియోగించడానికి అవసరమైన అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేసినట్లు, ఇవే గాక ఏపి ఓపెన్ స్కూల్ ద్వారా 16 సెంటర్లు ఇంటర్మీడియట్, 5 సెంటర్లలో 10 వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు డీఈఓ విజయేంద్ర రావు కలెక్టర్‌కు వివరించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో... ఏప్రిల్...!

ఎండలే కాదు.. ధరలూ మండుతాయ్..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఏప్రిల్ నెల వస్తుందంటే ఎండలు మండుతాయని అందరికీ తెలిసిందే. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెల ఎండలతో పాటు ధరలూ మండనున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధానాల వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు మూడు పూటలా తినే పరిస్థితి లేదు. ప్రతి ఒక్కరిపైనా పన్నుల భారం పడనుంది. ఏప్రిల్ 1 నుంచి ఏ వస్తువు ధర చూసినా ఆకాశాన్ని అంటనుంది. ఎల్ఈడీ టీవీలు, బట్టలు, మొబైల్ ఫోన్లు, బొమ్మలు, కెమెరా లెన్స్, ఎలక్ట్రికల్ కార్లు, డైమండ్ నగలు, నూనె, ఎలక్ట్రికల్ వాహనాలు తదితరాల ధరలు ఈ ఏడాది కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో పెరిగాయి. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల ఇకపై ప్రతినెలా వినియోగదారునికి 'షాక్' కొట్టనుంది. గతంలో ఆంధ్రప్రదేశ్ రెగ్యులేటరీ కమిషన్ ఏడాదికోసారి ప్రజాభిప్రాయాన్ని సేకరించి అనుగుణంగా నిర్ణయాలు చేసేది. అయితే ఇకపై రాష్ట్రం చేతిలో ఆ పరిస్థితి లేదు. ఏ నెలకానెల సర్దుబాటు ఛార్జీలు పెంచుకునేలా డిస్కంలకు అవకాశం ఇచ్చింది. టోల్‌గేట్లు సైతం వినియోగదారులపై భారం వేయనున్నాయి. ఈ టోల్‌గేట్లు భారం ఆర్టీసిపైన పడటం వల్ల మరింత భారం కానుంది. ఈ నష్టాలను పూడ్చుకునేందుకు ప్రయాణికులపై భారం వేసే అవకాశం లేకపోలేదు. జగన్ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఇప్పటికే నెలనెలా జీతాలొచ్చే పరిస్థితి లేదు. ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. ఇంటి వద్దకే రేషన్ ఇస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం, వాహనాల సిబ్బందికి రెండు నెలలుగా జీతాలివ్వకపోవడం, డీజిల్ ధరలు వేయకపోవడంతో ఏప్రిల్‌నెల నుంచి రేషన్ బియ్యం ఇవ్వలేమని, తమకు భారమవుతుందని ఇప్పటికే వారు తేల్చి చెప్పేశారు. ఇక గ్యాస్, పెట్రోల్ ధరలు షరా మామూలే. ఏదిఏమైనా కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ, పేదలపై భారం మోపుతున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని సాగనంపడమే ధ్యేయంగా వామపక్షాలు ఉమ్మడిగా ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని 'ప్రజా చైతన్య యాత్ర'ను గ్రామగ్రామాన చేపట్టనున్నట్లు వెల్లడించింది. దాదాపు నెలరోజుల పాటు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వేస్తున్న భారాలు, రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ తీరు ఎండగడుతూ ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శులు వెల్లడించారు.

వైయస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ

చిత్తూరుఅర్బన్ : మహిళల సంక్షేమమే వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. డ్వాక్రా మహిళలకు వైయస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం శనివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 26-50 వరకు ఉన్న డివిజన్‌ల్లోని స్వయం సహాయ సంఘాల ఆసర చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళా అభివద్ధి కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో కషి చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కువ పథకాలను మహిళల పేరుతో అమలు చేస్తున్నారని.. నాడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలు మాఫీ చేయడంలో భాగంగా మూడో విడత నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ , మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో సరికొత్త రికార్డు

చిత్తూరుఅర్బన్: నగర పాలక సంస్థ పన్నుల వసూళ్లలో సరికొత్త రికార్డును సృష్టించింది. నగర కమిషనర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ చేసిన కృషి ఫలితంగా మొండి బకాయిలు వసూలు చేసి నగర పాలక సంస్థలకు ఆదాయాన్ని చేకూర్చారు. రెండు నెలల పాటు ప్రణాళిక బద్ధంగా నగర పాలక సంస్థ సిబ్బంది పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వన్‌టౌమ్ సెటిమ్మెంట్ (ఒటిఎస్) సిబ్బంది కృషికి తోడైంది. వడ్డీ లేకుండా ఇంటి పన్ను, ఆస్తి పనులు చెల్లించవచ్చని ప్రకటించడంతో మార్చి 31వ తేది శుక్రవానికి నగర పాలక సంస్థ పన్నుల వసూలు రూ. 27.72 కోట్లు వసూలు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పన్నులు వసూళ్లులో నగర పాలక సంస్థ పురోగతి సాధించింది. గతేడాది రూ. 15.45 కోట్లు వసూలు చేస్తే ఈ ఏడాది రెట్టింపు వసూలు చేసింది.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడవ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలూ లేకుండా తగు సౌకర్యాలు ఏర్పాటు చేయవలసిందిగా తెలుగు నాడు విద్యార్థి సమైక్య నుంచి విన్నవించారు. వేసవి కాలం కాబట్టి విద్యార్థులు పరీక్ష రాసే కేంద్రం వద్ద తాగునీటి సరఫరా, విద్యుత్ ఆటంకం లేకుండా చూడాలని కోరారు.

వారంలో హైవే భూ సమస్య పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే కి సంబంధించిన భూముల విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే వారం లోపల పరిష్కరించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శనివారం తెలిపారు. అలా పరిష్కరించుకున్న వారి ఖాతాలలోకి పరిహారం ఇవ్వబడుతుందని, లేదంటే కోర్టు తీర్పు ప్రకారం వారికి న్యాయం చేయబడుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బైరెడ్డిపల్లి మండలంలోని గంగినాయిని పల్లి వద్ద భూసేకరణ విషయంలో ఇరు వర్గాల వారు కక్ష దారులుగా కోర్టును ఆశ్రయించడం జరిగిందని తెలిపారు. అయితే సాధ్యాసాధ్యాలు గమనించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అలా కాని పక్షంలో కోర్టు తీర్పు తర్వాత కోర్టు ఆదేశాల మేరకు వారికి సొమ్ము ఇవ్వబడుతుందని అంతవరకు ఆ సొమ్ము ప్రభుత్వం వద్ద ఉంటుందనన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారం కానందున కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని, కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని వారు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మిగతా కేసులున్న ప్రాంతాలలో రోడ్ల పనులు నిర్వ హించడం జరుగు తుందని అయితే అక్కడున్న స్ట్రక్చర్స్, చెట్లు ఉంటే వాటిని రికార్డు చేయబడి ఉంటాయని తీర్పు మేరకు పరిహారం చెల్లించడం జరుగు తుందని తెలిపారు.

హామీలన్నీ నెరవేర్చాం : ఎంఎల్ఏ ఆరణి

చిత్తూరుఅర్బన్ : గత ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ పరిష్కరించారని, ఇదేవిధంగా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలనూ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. శనివారం నగర పరిధిలోని 22వ వార్డు సచివాలయం పరిధిలో రాజీవ్ నగర్, మహాత్మా నగర్, దర్గా మిట్ట, తేనె బండ హరిజనవాడ, తేనె బండ ప్రాంతాల్లో "గడపగడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర కమిషనర్ డా. జె అరుణ, స్థానిక కార్పొరేటర్ గంగ ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల వివరాలను అందించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి భూసేకరణ పూర్తి చేయండి : జేసీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

గుడిపాల మండలంలోని కొన్ని ప్రాంతాలలో సేకరించిన భూమిని జాతీయ రహదారుల పనుల కోసం వెంటనే అప్పగించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, జాతీయ రహదారుల పిడి అర్చన తో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిపాల మండలం లో కొత్తపల్లి, రామా పురం, కేజే పురం ప్రాంతాలలో కొంత మేరకుభూమినిఅప్ప గించాల్సి ఉందని, ఆ భూములలో చెట్లు లేదా ఇతరకట్టడాలు ఉంటే వాటినివెంటనే గుర్తించి చెట్లకు సం బంధించి వయసును బట్టి పరిహారం నిర్ణ యించాలని, ఆ పరి హారానికి వెంటనే ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని, ఆ విధంగా పనులు వేగవంతంగా జరిగేందుకు భూసేకరణ చేసివారికి అప్పగించాలనన్నారు. ఇందుకు సంబంధించి ఒక్కో కార్యక్రమానికి కాలవ్యవధిని జాయింట్ కలెక్టర్ నిర్ణయించారు. చెన్నై- బెంగళూరు ఎక్స్ప్రెస్ హైవే పనులు వేగవంతం గా జరుగుతున్నాయ ని ఇంకా పెండింగ్ ఉన్న భూములు వారికి అప్పగించినట్ల యితే మరింత వేగ వంతంగా పనులు జరిగేందుకు వీలుం టుందని ఈ సంద ర్భంగా జాయింట్ కలెక్టర్ రెవిన్యూ అధికారులతో అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

తడి, పొడి వ్యర్థాలను వేరుగానే తరలించాలి

చిత్తూరుఅర్బన్ : నగరంలో తడి, పొడి వ్యర్థాలను వేరుగానే సేకరించాలని, వేరుగానే వాహనాల్లో తరలించాలని నగర కమిషనర్ డా. జె అరుణ పారిశుధ్య కార్మికులు, వాహనాల డ్రైవర్లను ఆదేశించారు. శనివారం ఉదయం కమిషనర్ స్థానిక రీట్స్ పేట, షర్మన్ పాఠశాల వద్ద పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యర్థాలను తరలిస్తున్న నగరపాలక వాహనాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వాహనాల్లో వ్యర్థాలను వేరువేరుగానే తరలించాలన్నారు. వాహనాలను నిర్దేశించిన మార్గాల్లో తప్పనిసరిగా తిప్పాలని, పూర్తిస్థాయిలో వ్యర్థాలను తొలగించాలన్నారు. ప్రధాన రహదారులపై ఎక్కడా వ్యర్థాల కుప్పలు ఉండరాదన్నారు. ఉదయం 7:30 కల్లా రోడ్లు శుభ్రత పనులు పూర్తి చేయాలన్నారు.

లీగల్ వాలంటీర్లతో న్యాయ సేవలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

పారా లీగల్ వాలంటీర్లు సామాన్య ప్రజలకు, న్యాయ సేవ వ్యవస్థకు మధ్య వారధిగా పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా కోర్టు న్యాయ సేవ సదన్ భవనం నందు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ్ కుమార్ తో కలిసి పారా లీగల్ వాలంటీర్లకు చట్టాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్లు సామాన్య ప్రజలకు మరియు న్యాయ సేవ సంస్థకు మధ్య అంతర్యాన్ని తగ్గించడానికి మధ్యవర్తులుగా వ్యవహరించి, న్యాయం పొందడంలో ఉన్న అడ్డంకులను తొలగించాలన్నారు. పారా లీగల్ వాలంటీర్ మంచి నడవడిక కలిగి ఉంటే వారికి న్యాయ వ్యవస్థకు సంబంధించిన చట్టాల పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందుతున్నాయాని, న్యాయ సేవలు ఎలా పొందాలన్న వివరాలను గ్రామీణ ప్రజలకు అవగాహన కలిగించాలని పారా లీగల్ వాలంటీర్ల కు సూచించారు. మన సర్వీసుల గురించి ప్రజలకు తెలిసివుండాలన్నారు. న్యాయ వ్యవస్థ పనిలో సూక్ష్మ నైపుణ్యం, వాటాదారుల పనితీరును సంబంధించి పూర్తి అవగాహన పారా లీగల్ వాలంటీర్లు చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఉత్తర్వుల మేరకు పారా లీగల్ వాలంటీర్లకు చట్టాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. లా విద్యార్థులు, జర్నలిస్టులు, సమాజ సేవ చేసే వారిని భాగస్వాములు చేయడం జరిగిందన్నారు. పారా వాలంటీర్ల ద్వారా గ్రామగ్రామాలకు న్యాయ సేవ కరదీపికను తీసుకెళ్లాడానికి సుప్రీంకోర్టు వారి సూచనల మేరకు పంచాయతీ వార్డు సెక్రటరీలు భాగస్వామి చేయడం జరిగిందని తెలిపారు. పారా లీగల్ వాలంటీర్లు గ్రామస్థాయిలో న్యాయ సేవలపై విస్తత ప్రచారం చేయాలన్నారు. గ్రామస్థాయిలో న్యాయ సేవలు, చట్టాలు ఉల్లంఘన సంబంధించి సమస్యలను మండల, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దష్టికి తీసుకురావాలన్నారు. గౌరవ అత్యున్నత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన లలిత్ గారు పారా లీగల్ వాలంటరీ వ్యవస్థను, స్వచ్ఛందంగా లీగల్ సర్వీస్ చేసే పారా లీగల్ వాలంటరీ మీద న్యాయవ్యవస్థ నమ్మకం పెట్టుకుందని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పారా లీగల్ వాలంటీర్లు న్యాయ కరదీపికను కదం తొక్కుతూ న్యాయ సేవలు ప్రజలకు అందించాలన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణకుమార్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాస్ మూర్తి న్యాయవ్యవస్థలోని చట్టాలపై పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన కలిగించారు.

ఈ కార్యక్రమంలో 8వ అదనపు జిల్లా జడ్జి ఎస్. శ్రీదేవి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాస్ మూర్తి, స్పెషల్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ కె.రవి, న్యాయవాదులు, లా విద్యార్థులు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

మే నెల 13వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఛాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరం మే నెల 13 న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను పోలీసు, రెవెన్యూ, కక్షదారులు, న్యాయవాదులు అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో న్యాయ సేవలు విస్తతంగా ప్రచారం చేయడమే కాకుండా వివిధ అంశాలలో ఉన్న కేసుల సమస్యలన్నింటిని, కోర్టులో పడిన లిటిగేషన్ కేసులు కూడా జాతీయ లోక్ అదాలత్‌లో నిర్వహించి స్నేహపూర్వకంగా పరిష్కారం చేయడం జరిగిందని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఎల్ఆర్ఎటి కేసులను కూడా అంటే ఆర్డీవో కోర్టులో ఉన్న కన్స్యూమర్ ఫోరంలో పర్మినెంట్ గా ఉన్న కేసులను పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతంగా నిర్వహించి మరొకమారు మన రాష్ట్ర చిత్రపటంలో జిల్లాను మొదటి విభాగంలో ఉండేట్లు పోలీసు, రెవెన్యూ, న్యాయవాదులు, మండల లీగల్ సర్వీస్ సంస్థ కమిటీ చైర్మన్లు సహాయ సహకారాలు అందించాలన్నారు.

అనుమానమే కారణమా..?

భార్యను కిరాతకంగా కడతేర్చిన భర్త

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

భార్యను అతి కిరాతకంగా నరికి చంపిన ఘటన శనివారం జిల్లా కేంద్రమైన చిత్తూరులోని కొంగారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల మేరకు... స్థానిక కొంగారెడ్డిపల్లి విద్యానగర్ కాలనీలో ఢిల్లీబాబు, హేమలత కాపురముంటున్నారు. ఢిల్లీ బాబు ఎస్ఆర్‌పురం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. హేమలత ఆర్కే మోడల్ స్కూల్ నందు ప్రయివేటు టీచర్‌గా పని చేస్తోంది. వీరికి ముగ్గురు సంతానం. మొదటి కుమారుడు వేణు రంగంపేట విద్యానికేతన్ కాలేజీలో బిటెక్ చదువుతున్నాడు. మరో ఇద్దరు కవలపిల్లలు ఉదయ్, ఉత్తేజ్‌లు చిత్తూరులోని వివేకానంద జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఢిల్లీబాబు, హేమలత మధ్య మనస్పర్థలతో పదేళ్ళుగా మాటామంతి లేదు. ఒకే ఇంట్లో ఉంటున్నా... ఇద్దరి మధ్య మాటలు లేకపోవడంతో భార్య హేమలతపై అనుమానం పెంచుకున్న ఢిల్లీబాబు శనివారం ఉదయం కవల పిల్లలు హాల్‌లో ఉండగా బాత్ రూం నుండీ బయటకు వస్తున్న హేమలతపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు.

తీవ్రంగా గాయపడ్డ హేమలత అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న డిఎస్‌పి శ్రీనివాసమూర్తి, వన్‌టౌన్ సిఐ నరసింహరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపిలో 'రాజకీయ వారసులు'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో రాజకీయ వారసులు వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఎంఎల్ఎలు అందరూ ఢిల్లీస్థాయి పదవులు ఆశించడం, వయోభారంతో ఇబ్బందులను దృష్ట్యా తాము ఉండగానే తమ వారసులను రాజకీయాల్లోకి దింపేస్తున్నారు. అధికార పార్టీలో ఈ రాజకీయ వారసులు ఎక్కువగా కనిపించడం గమనార్హం. అధికారం ఉండగానే వారసులను అందలమెక్కించాలని తపిస్తున్నారు. ఇప్పటికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తాను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని, జగన్‌కు వెన్నంటి ఉంటానని ప్రకటించారు. తన రాజకీయ వారసుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అందరూ ఆదరించాలని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి 2024 ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని, 2019 ఫలితాలు వచ్చినపుడే విజయోత్సవ సభలోనే చెప్పారు. ఆ మాటకు కట్టుబడి తన కొడుకు భూమన అభినయ్‌రెడ్డిని డిప్యూటీ మేయర్‌గా రాజకీయ అరంగేట్రం చేయించి 2024 ఎన్నికల్లో బరిలో దింపనున్నారు. ఏప్రిల్ మొదటివారంలో జరిగే మంత్రివర్గ విస్తరణలో శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డికి స్థానం ఉంటుందని చర్చ నడుస్తోంది. అతనికి మంత్రి పదవి ఇస్తే వచ్చే ఎన్నికల్లో బియ్యపు పవిత్రారెడ్డిని బరిలో నిలిపే అవకాశం ఉంది. డిప్యూటీ సిఎం నారాయణస్వామి 70 సంవత్సరాలు పైబడి ఉండడంతో అతని కుమార్తెను రంగంలోకి దింపుతారని చర్చ నడుస్తోంది. ఏదిఏమైనప్పటికీ 'ముందస్తు' ఎన్నికలు జరుగుతాయని చర్చ నడుస్తున్న నేపథ్యంలో రాజకీయ వారసుల ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

వైకాపా ఎంఎల్ఏలు ఇద్దరు టచ్‌లో ఉన్నారు : టిడిపి

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

అసంతృప్తితో ఎప్పుడైనా టిడిపిలోకి జంప్ చేసేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇద్దరు ఎంఎల్ఏలు పార్టీ అధినాయకత్వంలో టచ్‌లో ఉన్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు పులివర్తి నాని తెలిపారు. పరిస్థితి అనుకూలిస్తే ఎప్పుడైనా టిడిపిలో చేరేందుకు ఆ ఇద్దరు ఎంఎల్ఏలు సిద్ధంగా ఉన్నట్లు శనివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. అలాగే పుట్టపర్తిలో టిడిపి నేతలపై జరిగిన దాడిని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖడిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుండీ వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక వైకాపా గూండాలు తెలుగుదేశం నేతలపై దాడులకు తెగబడుతున్నారని, ఎన్ని అడ్డకుంటు సృష్టించినా లోకేష్ పాదయాత్రను అడ్డుకోలేరన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం విజయఢంగా మోగిస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మేయర్, టిడిపి నగర అధ్యక్షురాలు కఠారి హేమలత నాయకులు మోహన్‌రాజ్, కోదండయాదవ్‌లు పాల్గొన్నారు.

అధికార పార్టీలో రాజకీయ సంక్షోభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇన్నాళ్లూ తమకు ఎదురు లేదని అసెంబ్లీ ఎన్నికల నుంచి స్థానిక, మున్సిపల్ ఎన్నికల వరకూ విజయఢంకా మోగించిన వైసిపికి ఎంఎల్‌సి ఎన్నికలు తీవ్రమైన షాక్‌ను ఇచ్చాయి. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని నమ్ముకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఎంఎల్‌సి ఫలితాలు దిమ్మతిరిగేలా చేశాయి. దీంతో ఆ పార్టీలో అంతర్మథనం మొదలయ్యింది. ఆయా నియోజకవర్గాల్లో ఎంఎల్ఎల అక్రమాలు, ప్రజల్లో పాలన పట్ల వ్యతిరేకత ఎలా ఉందనే విషయాలపై సమీక్షిస్తున్నారు. తిరుపతి నియోజకవర్గంలో ఏదో చేద్దామనుకుని 'ఈ భూములన్నీ మావే' అని 22ఎ ఉత్తర్వులు తెచ్చారు. అయితే ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అసెంబ్లీ వరకూ తీసుకెళ్లి తాత్కాలికంగా ఉపశమనం కలిగించారు. శాశ్వత పరిష్కారం చూపేవరకూ 22ఎ కత్తి నగర ప్రజలపై వేలాడుతూనే ఉంటుంది. ఇది వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు తీవ్రమైన దెబ్బ అని చెప్పవచ్చు. చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి పోటీ చేయకుండా తనయుని బరిలో నింపడంపైనా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో ప్రజలకు ఎన్ని కానుకలు ఇచ్చినా వ్యతిరేకత ఉందని చర్చ నడుస్తోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు ఎంఎల్ఎ పేరు చెప్పుకుని భూఆక్రమణలు, భూదందాలు చేపట్టడం ఆ పార్టీ పట్ల సానుకూలంగా లేరు. నగరి మంత్రి ఆర్‌కె రోజా పరిస్థితి గడ్డుకాలమే అని చెప్పవచ్చు. సొంత పార్టీలోనే వ్యతిరేక వర్గం ఉండడంతో ఆమె ఓటమే ధ్యేయంగా పనిచేయనున్నారు. దాంతో పాటు స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఉదాహరణకు 30వేల కుటుంబాలున్న మరమగ్గం కార్మికుల సమస్యలను పట్టించుకోలేదు. అదనపు లోడ్ ఛార్జీలు పెంచాలని దీర్ఘకాలిక ఆందోళన చేస్తే వారిపై కేసులు బనాయించి భయపెట్టే ప్రయత్నం చేశారు. శ్రీకాళహస్తిలో స్థానిక ఎంఎల్ఎ పట్ల వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఎంఎల్ఎ పేరు చెప్పుకుని ద్వితీయశ్రేణి నాయకత్వం భూదందాలు, సెటిల్మెంట్ పేరుతో 'కమీషన్లు' ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన చిందేపల్లి ఘటన సంబంధించి అధికార పార్టీ ఫ్యాక్టరీకి అమ్ముడుపోయిందని గ్రామస్తులే స్వయంగా విమర్శిస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో ఆదిమూలంకు అడుగడుగునా వ్యతిరేకతే. సంపాదనే ధ్యేయంగా ఎంఎల్ఎ అనుచరులు పనిచేస్తున్నారని, ప్రజలకు సేవ చేయడం లేదని, ఒక గ్రూపునే ఎంఎల్ఎ ఆదిరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. జీడీనెల్లూరు నియోజకవర్గంలో నారాయణస్వామికి గడ్డుకాలమేనని చర్చ నడుస్తోంది. దళితులు × రెడ్డి సామాజికవర్గంగా అక్కడ 'వార్' నడుస్తోంది. పంతంబూని నారాయణస్వామిని ఇంటికి పంపిస్తామని క్యాడర్ ప్రచారం చేస్తోంది. ఈ వ్యతిరేకతలను మూటగట్టుకున్న పార్టీ సమీక్షించుకుని ఏ విధంగా ముందుకెళు తుందో చూడాల్సిందే.

పేదల పక్షాన పోరాడే ప్రభుత్వాన్ని ఆదరించండి

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి-కార్వేటినగరం: పేదల పక్షాన పోరాటం చేస్తూ, అన్ని సామాజిక వర్గాల అభివద్ధికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని బిల్లుదొన్న, గురవరాజగుంట, పోతువానిగుంట, విజయమాంబాపురం కార్వేటినగరం బీసీ కాలనీలలో ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ, కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో భాగంగా లబ్దిదారు కుప్పయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఇన్ని సంక్షేమ పథకాలను మేము చూడ లేదని, పేదలు ఆర్థికంగా ఎదగాలనే తపనతో ఆయన నవరత్నాలను అందిస్తూ ప్రతి



ఇంటికీ పెద్ద దిక్కుగా నిలువడం సంతోషంగా ఉంది అన్నారు. అనంతరం ఆదిమండడి మాట్లాడుతూ మాకు జగనన్న ఏమీ ఆశించ కుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు తనకు అందుతున్నాయని అన్నారు. దేశంలో ఉన్న పార్టీలు అన్నీ ఏకమై వచ్చినా మా జగనన్నకే ఓట్లు వేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ లోకనాథరెడ్డి, సర్పంచ్ గోవిందస్వామి, ఎంపీటీలు ధన్రాజ్, వెంకటేష్, మాజీ ఎంపీటీసీ మార్కొండేయులు, స్థానిక నాయకులు మురళీ, మహేష్, చందురాజు, ఎంపీడీవో మోహన మురళీ, డీఈ విద్యాసాగర్, విద్యుత్ ఏడీఈ నాగరాజు, హౌసింగ్ ఏఈ యోగేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల గొంతు కోసిన చంద్రబాబు

ఇంటి నిర్మాణాల పేరుతో ఒక్కరూపాయి వేసి పేదలను తడిగుడ్డతో గొంతు కోసిన చంద్రబాబుకు ప్రజలను ఓటు అడిగే అర్హత లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం బిల్లుదొన్న గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అధికారం కోసం చంద్రబాబు పేదలను పక్కాగృహాల పేరుతో ఒక్క రూపాయి ఖాతాల్లో వేసి ఊచకోత కోసిన చంద్రబాబుకు ప్రజలను ఓటు అడిగే అర్హత లేదని అన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

ప్రజాశక్తి-నగరి: వ్యాధి నిరోధక శక్తి టీకాలు అందరికీ వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం నగరి యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల్లోను, బుగ్గ అగ్రహారం పీహెచ్‌పీ పరిధిలోని సచివాలయాల్లోనూ వ్యాక్సిన్‌లు వేసే ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వ్యాధినిరోధక టీకాలపై తనిఖీలునిర్వహిస్తున్నామన్నారు. ఇందు నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 16 టీంలు ఏర్పాటుచేశామన్నారు. 11 సెషన్స్ విజిట్ పూర్తి చేశామన్నారు. వ్యాధినిరోధక టీకాలు వేయడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదన్నారు. తనిఖీలో అలాంటివి గుర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఏఎన్ఎంలు వ్యాక్సిన్లు ఎలా వేస్తున్నారు, సరిపడా వ్యాక్సిన్లు ఉన్నాయా, డ్యూ లిస్టు ఉందా, ఉన్న వ్యాక్సిన్లు ఎక్స్‌పైరీ డేట్‌లోపు ఉన్నాయా అని తనిఖీ చేశారు. సైడ్ ఎఫెక్ట్ వచ్చినపుడు దానిని తొలగించే ఏఈఎఫ్ఐ ఇంజక్షన్లు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ వేసిన ఇంజక్షన్‌ను నశింపజేసే హబ్‌కట్టర్‌ను సిబ్బంది ఉంచుకున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు.

రోగులతో స్నేహంగా మెలగాలి

ప్రజాశక్తి-పాలసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షలకు వచ్చే రోగులతో స్నేహంగా మెలిగి వైద్యం అందించాలని ఎంపీడీవో శ్రీనివాసన్ తెలిపారు. శనివారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో గ్రామాల్లో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించి, ఓఆర్ఎస్, మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులకు అందుబాటులో ఉండే వారు ప్రసవం వరకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

ప్రజాశక్తి-గంగవరం: గర్భిణులు, గర్భంలోని బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారంతోనే సాధ్యమవుతుందని జిల్లా ఎస్ఓ డాక్టర్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కళ్ళుపల్లి హెచ్‌డబ్ల్యు, అంగన్వాడీ కేంద్రంలో జిల్లా ఎస్ఓ డాక్టర్ రమేష్ రెడ్డి, మండల మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మంచి ఆహారం తీసుకోవాలని తెలిపారు. నర్సులు, ఆశ వర్కర్స్ అందుబాటులో ఉన్నారా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక సేవా కార్యకర్త కె చిన్న ఎస్ఓని సన్మానించారు. డాక్టర్ జ్యోతీశ్వర్, ఏఎన్ఎం నాగమణి, జ్యోతి, అంగన్వాడీ కార్యకర్త నిర్మల, ఆశ వర్కర్ పాపలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: తల్లీ బిడ్డల మరణాల నివారణ పౌష్టికాహారం

తీసుకోవడంతోనే సాధ్యమని డాక్టర్ ప్రశాంత్, వైద్యాధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాతపాలెంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో పౌష్టికాహార ప్రాధాన్యతపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాటాడుతూ గర్భిణులు తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం, వైఎస్ఆర్ కిట్‌ను తీసుకోవాలన్నారు. అలాగే ఆరోగ్య కార్యకర్తలు చెప్పే సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రతినెలా హెచ్‌బీ పరీక్ష చేయించుకోవాలన్నారు. సీహెచ్వో వరలక్ష్మి, ఆరోగ్య, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు రేణుక, బాను, కాంచన పాల్గొన్నారు.

సోమల: ఆరు సంవత్సరాల లోపు చిన్నారులు, గర్భిణులు, బాలిం

తలు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉండడమే కాకుండా రక్తహీనత లేకుండా ఉండవచ్చునని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రమైన సదుం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఆవశ్యకత కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. జడ్పిటిసి సోమశేఖర రెడ్డి, ఎంపీపీ మల్లప్ప, స్త్రీ శిశుసంక్షేమ శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవితాపం తీర్చడానికే చలివేంద్రం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వేసవి తాపం తీర్చడానికి ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పార్లమెంటు టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్ నాయుడు అన్నారు. శనివారం మండలంలోని అక్కనగారిపల్లి గ్రామంలో పలువురు యువకులతో కలిసి టిడిపి యువనేత చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అక్కనగారిపల్లె యువకులు లోకనాధనాయుడు, శేఖర్, సాగర్, బాలకష్ణ, కరుణ, బద్రి, ప్రశాంత్, చందు , గిరిధర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత నిస్తూ ప్రతిష్టాత్మకంగా నాడు నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ ఎన్. రెడ్డప్ప, మండల కన్వీనర్ జి.బాగా రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే ఎన్.వెంకటే గౌడ పలమనేరు నియోజకవర్గ వ్యాప్తంగా, అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి సుష్మా బాగ రెడ్డి, వైస్ ఎంపీపీ జి.డి.బాబు, మండల వెసీపీ నాయకుల ఆధ్వర్యంలో ఫ్యాడ్లు, పెన్నులను తదితర విద్యా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. నియోజకవర్గం లో పేద బడుగు విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారని ఉద్దేశంతో మన ఎమ్మెల్యే వెంకటే గౌడ్ విద్యార్థులకు చేయూతనందిస్తున్నారని అటువంటి నాయకులకు మనం వెన్నంటే ఉండాలని మండల కన్వీనర్ బాగా రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో ఒత్తిడిని అధిగమించి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలతో రాష్ట్రంలోనే మండలాన్ని ఆదర్శంగా నిలపాలని, ఉన్నతమైన ఆశయాలతో చదువును అభ్యసించాలని ఎంపీపీ రెడ్డప్ప సూచించారు. ఈ విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, తమ్మిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, సర్పంచ్ రవికుమార్, అఖిలా జాఫర్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10 తరగతి విద్యార్థులకు పలమనేరు నియోజకవర్గ శాసనసభ్యులు వెంకటే గౌడ వారి బందం సహకారంతో పరీక్ష సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుల ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి సాయి లీల హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో 10వ తరగతి మొదటి మెట్టుతో సమానమని, సోమవారం నుండి జరగబోయే పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రామకుప్పం: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, కుప్పం పిఎస్ ఆసుపత్రి వారి సహకారంతో 3వ తేదీ నిర్వహించనున్న వైద్య శిబిరం విజయవంతం చేయాలని చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరానికి వివిధ సమస్యలతో వచ్చు రోగులకు సరైన వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేయాలని సూచించారు. అలాగే శుక్రవారం కష్ణరాజపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళలకు ప్రభుత్వం ఆదుకోవాలని వైద్య పరీక్షల ఖర్చు భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి,

మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నేతలు ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, చంద్రశేఖర్, రామకష్ణప్ప, విశ్వనాథ్, జ్ఞాన శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా పంపిణీ ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-శాంతిపురం: మండల సచివాలయ కేంద్రంలో ఆదివారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను జడ్పిటిసి ఎస్ శ్రీనివాసులు, ఎంపీపీ కె వసుంధర కోదండ రెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, జిల్లా బిసి అధ్యక్షుడు ఎం సుబ్రహ్మణ్యం తదితరులు శనివారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 1000 గ్రూపు లకు చెందిన 8680 మంది లబ్ధిదారులకు రూ.9.71 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నట్లు వారు పాత్రికేయులకు తెలిపారు. మండల యూత్ అధ్యక్షుడు విజయ్ కుమార్, ఎఎంసి సభ్యుడు విద్యాసాగర్, ఎంపీటీసీలు రమేష్ కుమార్, దేవేంద్రన్, నేతలు సుబ్రమణ్యం ఆర్ అండ్ రామచంద్ర, గంగాధర్ పాల్గొన్నారు.

సోమల: ఈనెల 5వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా మండలంలోని స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు అందించే ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెలుగు ఎపిఎం శివ తెలిపారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో సంఘమిత్రలతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో ఎంపీపీ ఈశ్వరయ్య, మాజీ ఏఎంసీ ఛైర్మన్ లు అమాస మోహన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మండలంలోని అన్ని మహిళా సంఘాల సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి, సంఘమిత్రలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలో నేడు జరుగనున్న వైఎస్సార్ ఆసరా

పంపిణీ కార్యక్రమానికి మండల కన్వీనర్ కార్తీక్, స్థానిక సర్పంచ్ కె వెంకటేష్, ఏపీవో, సీసీలు, సంఘమిత్రాలు కలిసి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల కన్వీనర్ శనివారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి వచ్చే నాయకులకు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా షామియానా, తాగునీరు తదితర వసతులు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను సిఆర్‌సిహెచ్‌ఎం శివరత్న శనివారం పరిశీలించారు. తరల్ కార్యక్రమంలో భాగంగా గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులను ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య విద్యార్థులతో చదివించి వారి అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాజారెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నాయుడుపేట: వైసీపీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి 64వ జన్మదిన వేడుకలు శనివారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. 64 కిలోల భారీ కేకు కోసి అందరికీ పంచిపెట్టారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి. సంజీవయ్య, పలువురు వైసీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపికా, 24వ వార్డు కౌన్సిలర్ దారా రవి, 2వ వార్డు కౌన్సిలర్ పాలేటి నాగార్జున పలువురు వైసిపి నాయకులు, అధికారులు, కౌన్సిలర్లు కామిరెడ్డి రాజారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో వేదవ్యాస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన రెండో సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ, పుత్తూరు డివిజన్ స్థాయిలో అత్యంత మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.అనిల్ కుమార్ తెలిపారు. జయమునీశ్వర్(9.49) లావణ్య, లోకనాథం (9.13), లీలావతి(9.01), తేజ(9.0), నందిని(8.67), జానకి (8.59), రేవతి(9.06) ప్రతిభ చూపారని పేర్కొన్నారు. విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్ డైరెక్టర్ ఎం వేదవ్యాస, సి బాల సరస్వతి అభినందించారు.

దారి కల్పించాలని వినతి

ప్రజాశక్తి-బాలాయపల్లి: వ్యవసాయ పొలంలోకి వెళ్లనివ్వకుండా అగ్రకులాల వారు అడ్డుకున్నారని మండలంలోని నిండల గ్రామానికి చెందిన దానం మనోహర్ శనివారం తహశీల్దారు శ్రీనివాసులకు విన్నవించారు. తాము సాగు చేసుకుంటున్న నిమ్మ పొలంలోకి వెళ్లనివ్వకుండా అగ్ర కులాలవారు అడ్డుకోవడంతో నిమ్మ చెట్లు ఎండిపోతున్నాయని బోరున విలపించారు.

శస్త్రచికిత్సతో గడ్డ తొలగింపు

ప్రజాశక్తి-కుప్పం: స్థానిక బిఆర్‌డి హాస్పిటల్‌లో ఓ మహిళకు వైద్యులు శస్త్రచికిత్స చేసి కడుపులోని 10 కేజీల గడ్డను విజయవంతంగా శనివారం తొలగించారు. వివరాలు.. రామకుప్పం మండలానికి చెందిన లక్ష్మమ్మ (56) బి ఆర్‌డి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి ఈ నెల 30న వచ్చింది. పరీక్షించిన వైద్యులు నివ్వెరపోయారు. ఆ మహిళ కడుపులో భారీ సైజు గడ్డ ఉన్నట్లు తేలింది. దీంతో ఆమెకు అన్ని పరీక్షలూ చేసి క్లిష్టమైన ఆపరేషన్‌కు పూనుకున్నారు. డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శస్త్ర చికిత్స జరిగింది. గంట వ్యవధిలోనే ఆమె కడుపులోని 10 కిలోల గడ్డను బయటకు తీశారు. ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు సురేష్ బాబు తెలిపారు.

స్వచ్ఛ మాషాల్ మార్చ్ ర్యాలీ

ప్రజాశక్తి-నగరి: స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారి స్వచ్ఛ ఉత్సవ్ సందర్భంగా నగరి మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తొప్పమ్మ గుడి వీధి వరకు స్వచ్ఛ మాషాల్ మార్చ్ ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పట్టణ ప్రజలు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించరాదన్నారు. తడిచెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందచేయాలన్నారు. ప్రజా పరివర్తనతోనే చెత్త రహిత నగరిని సాధించవచ్చని తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న అందరి చేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సిలర్లు ఎంఆర్ భూపాలన్, పురపాలక సంఘ సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బంది, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

రూ.1.48 లక్షల రికవరీ

ప్రజాశక్తి-బంగారు పాళ్యం: మండల కార్యాలయంలో మార్చి నెల 8 నుండి 19వ తేదీ వరకు 41 గ్రామ పంచాయితీల 2021-2022 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పనులను సామాజిక తనిఖీ చేసినట్లు ఎనర్జీ పిడి గంగా భవాని శనివారం తెలిపారు. ఈ సందర్భంగా గంగా భవాని మాట్లాడుతూ రూ.1,48,500ల రికవరీ చేసినట్టు తెలిపారు. మొత్తం 7 పనులకు రూ.5,77,42,036 లు మంజూరైనట్లు తెలిపారు. వీటిని సామాజిక తనిఖీ బందం రూ.1,48,500 లు సమాచార బోర్డు ఏర్పాటు చేయలేదని తిరిగి చెల్లించమని తనిఖీ చేసి రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, క్లస్టర్ ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఎస్టియం లోకేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాములకు కల్యాణోత్సవం పూజలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చల వెంకటేశ పెరుమాళ్ ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం పూజలను వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా శనివారం ఉత్సవమూర్తులైన సీతారాములకు పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరణలు చేసి కల్యాణోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈపూజలకు పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బాగతారని రాధిక హరికథ కాలక్షేపం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామస్వామి శేఖర్, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీ నల్గొండరాయస్వామికి అభిషేక పూజలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనత్తం గ్రామంలో వెలసిన శ్రీ నల్గొండరాయస్వామి ఆలయంలో శనివారం వైభవంగా అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి మూల వర్లకు ప్రత్యేకంగా పంచామత అభిషేకం, విశేషపూజలు, అర్చకులు రామకష్ణమాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉభయదార్లు, ఆలయ ధర్మకర్త మురళీస్వామి, భక్తులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి-పుంగనూరు: కర్ణాటక రాష్ట్రం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీతారామిరెడ్డి కథనం మేరకు వివరాలిలా...పట్టణ సమీపంలో ఉన్న వనమలదిన్నే రోడ్‌లోని రామనగర్ కాలనీ వద్ద ఆటోనందు కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామని తెలిపారు .ఈ దాడుల్లో పుంగనూరుకు చెందిన ముదిసిర్ భాష కుమారుడు సయ్యద్ అష్రాఫ్ అలీ, మోతీనగర్‌కు చెందిన జప్రూలా కుమారుడు జునాద్ లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి వద్దనుండి 600 హైవార్డ్స్ విస్కీ 90 ఎం.ఎల్ బాటిల్స్, టెట్రాపాకెట్స్, ఓల్డ్ అడ్మిరల్ బ్రాండీ 9 ఫుల్ బాటిల్స్ కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని మద్యం తో పాటు అప్పి ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు చెప్పారు. ఎస్ఐ జి.అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: ముందస్తు సమాచారం మేరకు స్థానిక రెడ్డిగుంట కలెక్టరేట్ వద్ద వన్‌టౌన్ సిఐ నరసింహ రాజు, ఎస్ఐ రమేష్‌బాబుతో పాటు పోలీసు సిబ్బంది తనిఖీలు చేస్తుండగా ఆటు వైపుగా వస్తున్న టాటా సఫరీ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో కర్ణాటక అక్రమ మద్యం ఉన్నట్లు గుర్తించి వాహనంలోని ఓం మూర్తి, కన్నన్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కర్ణాటక మద్యం అక్రమ కేసులో ఓం మూర్తి, కన్నన్‌లపై గతంలోనూ కేసులున్నట్లు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి టెంపో దగ్ధం

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని కొంగనపల్లి పంచాయతీ వెంకటాపురం వద్ద విద్యుత్ వైర్లు తగిలి టెంపో దగ్ధమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా... వెంకటాపురం కోళ్ల ఫామ్ వద్ద కోడిగుడ్లును టెంపోలో తరలిస్తుండగా మార్గమధ్యమైన గ్రామ శివారులోని మలు పు వద్ద 11 కెవి విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ మొహమ్మద్ అలీ (55) తప్పించుకోబోయి కిందపడ్డాడు. ప్రమాదవశాత్తు అతను అక్కడికక్కడే మతి చెందాడు. మతుడిది ఒరిస్సా రాష్ట్రం అని తెలిసింది. హుటా హుటిన ఫైర్ సిబ్బంది అక్కడి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలపై ఆరా తీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు..

ప్రజాశక్తి-నగరి: స్థానిక ఎంపీడీవో కార్యాలయ వీధిలో నివశిస్తున్న సుధాకర్, శోభ ఇంటి ముందు ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. వాహనాలు కాలిపోతూ పెద్ద శబ్దం రావడంతో నిద్రపోతున్న వారు బయటకు వచ్చి వాహనాలు దగ్ధమవుతుండటాన్ని గమనించి నీటితో ఆర్పడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే వాహనాలు దగ్ధమయ్యాయి. సుధాకర్ అందించిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి ముందున్న సీసీ కెమెరాలో పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి వాహనాలపై పెట్రోలు పోసి తగలబెట్టిన దృశ్యాలు నమోదై ఉండటం గమనించారు. ఈ ఆధారాలతో విచారణ చేస్తున్నారు. వ్యక్తిగత కక్ష్యల కారణంగా వాహనాలను దగ్ధం చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-నగరి: మండలంలోని మేళపట్టు గ్రామ సమీపం కుశస్థలి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సీజ్ చేశారు. శనివారం స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌చేసి తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు.

మెరుగైన వైద్యం అందించండి



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని కష్ణరాజపురం వద్ద శుక్రవారం వైఎస్ఆర్ ఆసరా సభకు మహిళలు వెళ్తున్న బొలెరో వాహనం బోల్తా పడి తీవ్ర గాయాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఆరోగ్య వైద్య శాఖ అధికారి డాక్టర్ ప్రకాశం పేర్కొన్నారు. శనివారం కుప్పం పీఈఎస్ ఆసుపత్రిలో క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులకు పలు సూచనలు చేసి క్షతగాత్రులు త్వరగా కోలుకునే విధంగా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా అధికారులు జయరాముడు, రామ్మోహన్ , అల్తాఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.